RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 321 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం శుక్రవారం, 24 మే 2024 పేజీలు : 4 వెల : 2/-

# అంతు చిక్కని ఓటరు నాడీ

## చేవెళ్ల, మహబూబ్‌నగర్, భువనగిరి, జహీరాబాద్, మెదక్, వరంగల్, సికింద్రాబాద్‌లో కాంగ్రెస్, కమలం హోరాహోరీ..




## గెలుపుపై జోరుగా బెట్టింగులు

హైదరాబాద్: రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికలు ముగిసి వారం దాటినా.. ఏడు నియోజకవర్గాల్లో ఓటరు నాడీ మాత్రం ఇప్పటికీ అంతుచిక్కడం లేదు. స్టేట్ లో మొత్తం 17 లోక్ సభ సీట్లకు పోలింగ్ జరగ్గా.. ఇందులో చేవెళ్ల, మహబూబ్ నగర్, భువనగిరి, జహీరాబాద్, మెదక్, వరంగల్, సికింద్రాబాద్ స్థానాల్లో పోలింగ్ సరళి ఎవరికీ అర్థం కావట్లేదు. మిగతా 10 నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీలలో ఏదో ఒక పార్టీకి కొంత మొగ్గు ఉన్నట్టు స్పష్టమవుతున్నా.. ఈ ఏడు సెగ్మెంట్లలో మాత్రం కాంగ్రెస్, కమలం హోరాహోరీగా తలపడ్డాయి. అయితే, ఇందులో గెలుపు కాంగ్రెస్‌దా? కమలానిదా? అంటే ఎటూ చెప్పలేని ఉత్కంఠ కొనసాగుతోంది. బీఆర్ఎస్ ఓట్లు ఎటువైపు మళ్లాయో తెలియడం లేదు. గెలుపు మాదే అని రెండింటిలో ఏ పార్టీ కూడా స్పష్టంగా చెప్పలేకపోతున్నాయి.

**చేవెళ్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ :** చేవెళ్లలో కాంగ్రెస్ నుంచి రంజిత్ రెడ్డి, బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్ రెడ్డి హోరాహోరీగా తలపడ్డారు. అర్బన్ లో బీజేపీకి మొగ్గు ఉందని ఆ పార్టీ ధీమాగా ఉండగా.. రూరల్ ఓటర్లు కాంగ్రెస్ కు మొగ్గు చూపినట్టు అధికార పార్టీలో ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ ఓటు ఎటువైపు మళ్లిందనే అంశంపైనా చర్చ సాగుతోంది. దీంతో ఇక్కడ గెలుపు ఎవరిదనేది చెప్పడం అంత ఈజీగా లేదని రెండు పార్టీలు చెప్పుకుంటున్నాయి.

**భువనగిరిపై సీఎం, కోమటిరెడ్డి బ్రదర్స్ ఫోకస్ :** భువనగిరిలో బీజేపీ తరఫున మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, కాంగ్రెస్ నుంచి సీఎం రేవంత్ సన్నిహితుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి బరిలో నిలవడంతో ఇక్కడ పోరు ఉత్కంఠగా మారింది. నర్సయ్య గౌడ్‌కు బీసీ వర్గాల మద్దతు ఉన్నట్టు బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది. చామలకు మద్దతుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి విస్తృత ప్రచారం చేయడం, సీఎం రేవంత్ కూడా దీనిపై స్పెషల్ ఫోకస్ పెట్టడంతో గెలుపు ఎవరిదనేది అంతుచిక్కడం లేదు.

**జహీరాబాద్‌లో ఇద్దరు మాజీ ఎంపీల మధ్య పోటీ :** జహీరాబాద్‌లో బీజేపీ నుంచి బీబీ పాటిల్, కాంగ్రెస్ తరఫున సురేశ్ షెట్కార్ పోటీ పడ్డారు. ఈ సెగ్మెంట్‌లో ఈ ఇద్దరూ ఎంపీలుగా పనిచేయడం.. ఆ ప్రాంతంపై ఇద్దరికీ పట్టు ఉండడంతో ఇద్దరు మాజీ ఎంపీల మధ్య ఉత్కంఠ పోరు సాగింది. రెండు జాతీయ పార్టీలు కూడా అక్కడ తీవ్ర ప్రభావం చూపడంతో గెలుపెవరిదనేది ఉత్కంఠగా మారింది.

**వరంగల్‌లో అనుభవజ్ఞులకు పరీక్ష :** వరంగల్‌లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కావ్య కాంగ్రెస్ తరఫున, బీజేపీ తరఫున వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ బరిలో నిలిచారు.

అయితే, కడియం శ్రీహరికి ఉన్న రాజకీయ అనుభవానికి తోడు కాంగ్రెస్ బలం కావ్య గెలుపునకు కలిసి వస్తుందని హస్తం పార్టీ భావిస్తోంది. మోదీ ప్రభావానికి తోడు రమేశ్ గతంలో ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉండడంతో బీజేపీకి గెలుపు అవకాశాలు ఉంటాయని కమలం నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ సెగ్మెంట్‌లో గెలుపు అనుభవజ్ఞులైన కడియం, రమేశ్‌కు పరీక్షగా మారింది.

**సికింద్రాబాద్ సెగ్మెంట్‌లో ఉత్కంఠ :** సికింద్రాబాద్‌లో పోరు ఉత్కంఠను రేపుతోంది. ఇక్కడ బీజేపీ తరఫున కేంద్ర మంత్రి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి బరిలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ తరఫున మాజీ మంత్రి పద్మారావు పోటీ చేశారు.

ముగ్గురూ రాజకీయంగా బలమైన నేతలే కావడంతో ఇక్కడ ఒక రకంగా చెప్పాలంటే త్రిముఖ పోరు సాగింది. అయితే, రెండు జాతీయ పార్టీల ప్రభావమే పోలింగ్ సందర్భంగా బాగా పని చేయడంతో బీజేపీ, కాంగ్రెస్ హోరాహోరీగా తలపడ్డాయి. దీంతో ఇక్కడ ఈ రెండు పార్టీల్లో గెలుపు ఎవరిదనేది అంతు చిక్కడం లేదు.

**మెదక్‌లో త్రిముఖ పోరు :** మెదక్‌లో త్రిముఖ పోరు సాగిందనే చర్చ సాగుతోంది. ఇక్కడ బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు పోటీ చేయగా, కాంగ్రెస్ నుంచి నీలం మధు, బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ, మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డి పోటీ చేశారు. ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, అటు దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ.. ఈ రెండు పార్టీల ప్రభావం ఈ నియోజకవర్గ ఓటర్లపై కనిపించింది. ఇదే సమయంలో బీఆర్ఎస్ తరఫున బలమైన అభ్యర్థి వెంకట్రామి రెడ్డి కూడా బరిలో నిలవడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. కానీ, ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపారనేది అంతు చిక్కడం లేదు.

**సీఎం సొంత సెగ్మెంట్ మహబూబ్‌నగర్‌లో సస్పెన్స్ :** మహబూబ్‌నగర్‌లో బీజేపీ తరఫున డీకే అరుణ, కాంగ్రెస్ నుంచి వంశీచంద్ రెడ్డి నువ్వా.. నేనా అన్నట్టు తలపడ్డారు.

అరుణ గెలిస్తే మోదీ సర్కార్ లో కీలకంగా ఉంటారని ప్రచారం సాగడం, సీఎం రేవంత్ సొంత నియోజకవర్గంలో వంశీని గెలిపించాలని కాంగ్రెస్ కోరడంతో ఈ సెగ్మెంట్‌ఓటర్లు ఎటు వైపు మొగ్గు చూపారనేది సస్పెన్స్‌గా మారింది.

**పోటాపోటీగా బెట్టింగ్‌లు :** ఈ ఏడు నియోజకవర్గాల్లో ఓటరు తీర్పు ఎవరికీ అంతు చిక్కకపోవడంతో రెండు పార్టీల క్యాడర్, అభిమానులు, ఎవరికి వారే పోటాపోటీగా బెట్టింగ్ లు కట్టారు.

మా పార్టీదే గెలుపని కమలం క్యాడర్.. కాంగ్రెస్ దే గెలుపని హస్తం క్యాడర్ ఎవరి స్థాయిలో వారు పెద్ద మొత్తంలో పందేలు కాశారు. రాజకీయం పట్ల ఆసక్తి ఉన్న పలువురు వ్యాపారులు, రియల్టర్లు, బిల్డర్లు సైతం ఈ సెగ్మెంట్లలో పెద్ద మొత్తంలో బెట్టింగ్ కట్టారు.




## హరీశ్.. మీ కుటుంబం అంతా సోనియా కాళ్లు మొక్కలేదా..?

హైదరాబాద్: బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీశ్ రావుపై పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు సోనియా గాంధీని ఆహ్వానిస్తే తప్పేంటని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కుటుంబ సమేతంగా వెళ్లి సోనియా గాంధీ కాళ్లు మొక్కలేదా అని నిలదీశారు. ఇప్పుడు ఏ హోదాలో సోనియా గాంధీని దశాబ్ది ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నారని మాట్లాడటం సరికాదని సూచించారు. సోనియా గాంధీ దయ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. యువకుల ఆత్మహత్యలు చూసి, బీడు బారిన ప్రాంతానికి నీళ్ళు ఇవ్వాలని, నిధులతో తెలంగాణ సస్యశ్యామలంగా ఉండాలని ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని తేల్చిచెప్పారు. తెలంగాణ బాధ చూడలేక రాష్ట్రం ఇస్తే జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకువెళ్ళారని బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. సోనియా గాంధీని తెలంగాణ దేవతగా ప్రజానీకం గౌరవిస్తున్నారని రామ్మోహన్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ వ్యతిరేకులకు విందు భోజనాలు ఏర్పాటు చేసింది మీరు.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తులను మంత్రివర్గంలోకి తీసుకున్న ఘనత మీది..? బీజేపీ, సుష్మా స్వరాజ్ తెలంగాణ ఏర్పాటు విషయంలో సోనియా గాంధీని ప్రశంసించారని రామ్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. రైతు వ్యతిరేక చట్టాలకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇచ్చిందని రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. సన్న వడ్లతో బోనస్ ప్రారంభించి.. దొడ్డు వడ్లకు కొనసాగిస్తామని రామ్మోహన్ రెడ్డి తేల్చి చెప్పారు. ఎక్కడ కూడా సీఎం రేవంత్, మంత్రులు దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వమని చెప్పలేదన్నారు. మహేశ్వర్ రెడ్డి దగ్గర ఆధారాలు కాదు ఎన్ని టన్నుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసిందనే డాటా కూడా తప్పుగా ఉందని మండిపడ్డారు.

## తెలంగాణ జిల్లాల్లో రెండు రోజులపాటు వర్షాలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు తెలిపారు. శనివారం రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు రోజుల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 30- 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీయనున్నాయి. బుధవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం ఈశాన్య దిక్కులో కదులుతోంది. గురువారం ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానికి అనుకొని ఉన్న దక్షిణ బంగాళాఖాతం ప్రాంతంలో స్పష్టమైన అల్ప పీడన ప్రాంతంగా కొనసాగుతోంది. అది ఈశాన్య దిశలో కదిలి ఈనెల 24న మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. వాయుగుండం ఈశాన్య దిక్కులోనే కదులుతూ మరింత బలపడి ఈనెల 25న ఉదయం తూర్పు




మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో తుపానుగా మారనుంది. అనంతరం ఉత్తర దిక్కులోనే కదులుతూ మరింత బలపడి తీవ్ర తుపానుగా మారి ఈ నెల 26 నాటికి బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకొనే అవకాశం ఉన్నట్లు వాతావరణ నిపుణులు వెల్లడించారు. నైరుతి రుతుపవనాలు దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల్లోని మిగిలిన ప్రాంతం, ఉత్తర మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లోకి రాగల రెండు రోజుల్లో విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. రాష్ట్రంలో కింద స్థాయి గాలులు ప్రధానంగా ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్నాయి.



# అదుపు... అదుపు... మాట పొదుపు...

## కేటీఆర్‌కు మంత్రి మాస్ వార్నింగ్..!

హైదరాబాద్, మే 23: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. నోరు అదుపులో పెట్టుకోవాలంటూ కేటీఆర్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మరోసారి తమ ముఖ్యమంత్రి రేవంత్‌ని తిడితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. కేటీఆర్ బచ్చా అని.. తండ్రి పేరు చెప్పుకుని మంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు.

కానీ, రేవంత్ రెడ్డి ఇండిపెండెంట్‌గా గెలిచి లీడర్ అయ్యారని పేర్కొన్నారు. రేవంత్ వయసులో పోలిస్తే కేటీఆర్ చిన్న పిల్లాడు అని వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో కేకే మహేందర్ రెడ్డి పొట్ట కొట్టి కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యాడని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల రిజల్ట్స్ తరువాత బీఆర్ఎస్ భూస్థాపితం అవడం ఖాయం అని అన్నారు. మేడిగడ్డ మాదిరిగానే బీఆర్ఎస్ పార్టీ కూలిపోవడం ఖాయం అన్నారు.

కేసీఆర్ కూతురు కవిత చేసిన పనికి రాష్ట్రం పరువు పోతోందని వ్యాఖ్యానించారు మంత్రి. 5వ తేదీ నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలే కేటీఆర్, హరీష్ రావుని కొడుతారని అన్నారు. నంది నగర్ నుండి కారులో న్యూట్రల్‌లో వెళ్లినా అసెంబ్లీకి చేరుకోవచ్చునని.. కట్టే పట్టుకొని అసెంబ్లీకి రాలేదు కానీ, బీజేపీ కోసం బస్సులో తిరిగారని కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు మంత్రి. అసలు తెలంగాణ కోసం కొట్లాడింది తామేనని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.

**అన్ని స్థానాల్లో ఓటమి తప్పదు..** తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి రెండు మూడు స్థానాల్లో డిపాజిట్ వస్తుందని.. అన్ని స్థానాల్లో ఓడిపోతుందని మంత్రి కోమటిరెడ్డి జోస్యం చెప్పారు. 12 రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ లేకుండా పోతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి లీడర్, క్యాడర్ లేకుండా పోతారని అన్నారు. 5వ తేది తర్వాత తెలంగాణ భవన్‌కి తాళం వేసుకోవాల్సి వస్తుందన్నారు. కవితకు బెయిల్ రావట్లేదని కేటీఆర్ పూర్తిగా ఫ్రస్టేషన్‌లోకి వెళ్లారని.. అందుకే ఇష్టారీతిన తమ ప్రభుత్వంపై కారుకూతలు కూస్తున్నారంటూ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మా సీఎంనే తిడతావా? :** 'మా ముఖ్యమంత్రిని తిడుతావా కేటీఆర్.. మహిళలకు ఉచిత బస్సు ఇస్తున్నందుకు మా రేవంత్ ని తిడుతున్నావా? 500 రూపాయలకు సిలిండర్, ఉచిత విద్యుత్ ఇవ్వడమే మేం చేస్తున్న పాపమా? హాస్టల్స్, పేదవారికి ఇచ్చే ఉచిత బియ్యం పూర్తిగా సన్నబియ్యం ఇద్దామనుకోవడం తప్పా? మేం ఇచ్చిన నోటిఫికేషన్ కాంగ్రెస్ క్లెయిమ్ చేసుకుంటుంది అంటున్నావ్. మరి మీరే ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారు? మా ముందు చూపుతోనే హైదరాబాద్ అభివృద్ధి జరిగింది. కేసీఆర్ చేసిన పనికి మూడు డ్యాములు కొట్టుకొని పోయే ప్రమాదం ఉందని నిపుణులు చెప్తున్నారు. కాళేశ్వరం పేరుతో కోట్ల రూపాయలు వృధా చేశారు. వైన్ షాపుల పేరు మీద కేసీఆర్ నాన్ రిఫండబుల్ పైసలు గుంజిండు. ఏకకాలంలో రుణమాఫీ చేయబోతున్నాం. మల్లన్నపై కేసులు ఉన్నాయని అంటున్నావ్.. మీ చెల్లిపై 8000 పేజీల ఛార్జ్ షీట్ పై ఏమంటావ్ కేటీఆర్? మహేశ్వర్ రెడ్డి ఏం పైరవీ చేసుకొని పదవి తెచ్చుకున్నారు? ఆయన పేరు పలకాలంటే సిగ్గుగా ఉంది?' అని కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

**మహేశ్వర్ రెడ్డిపై మంత్రి ఫైర్..** తెలంగాణ బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు.

ఈ డిపార్ట్‌మెంట్‌కి వెళ్లినా మహేశ్వర్ రెడ్డి ఆర్టీఐ అప్లికేషన్లే ఉంటున్నాయని అన్నారు. బ్లాక్ మెయిల్ చేసి పైసలు సంపాదించాలని మహేశ్వర్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. ఆర్టీఐలు కోరుతున్న మహేశ్వర్ రెడ్డి.. నిర్మల్ నియోజకవర్గానికి ఏం కావాలని ఒక్కసారైనా అడిగారా? అని మంత్రి ప్రశ్నించారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## పోస్టల్ శకునం ఎవరికి శుభ సూచకం ?

కౌంటింగ్ ప్రక్రియలో ఎపుడూ మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఈసారి అలాగే జరుగుతుందని అంటున్నారు. ఏపీలో చూస్తే ఎన్నడూ లేని విధంగా ఈసారి రికార్డు స్థాయిలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరిగింది. చాలా జిల్లాలలో నూటికి నూరు శాతం పోలింగ్ జరిగింది. గతసారి అంటే 2019లో 2 లక్షల 95 దాకా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగితే ఈసారి ఆ సంఖ్య కాస్తా ఈసారికి 4 లక్షల 44 వేల ఓట్లకు పై దాటింది. గతసారి పోస్టల్ బ్యాలెట్ లో ఎక్కువ ఓట్లు వైసీపీకి దక్కాలి. ఆ తరువాత ప్లేస్ లో టీడీపీ ఉంది. వైసీపీకి ఆనాడు ఒక లక్షా 36 వేల 768 ఓట్లు వస్తే టీడీపీకి 81 వేల 608 ఓట్లు లభించాయి. ఈసారి చూస్తే భారీ పోలింగ్ జరిగింది కాబట్టి పోస్టల్ బ్యాలెట్ లో తొంబై శాతానికి పైగా టీడీపీ కూటమికే అని కూటమి నేతలు చెబుతున్నారు. అయితే అలా ఎలా జరుగుతుంది ఈసారి ఉద్యోగులు పెద్ద ఎత్తున పెరిగారు అందులో జగన్ నియామకాలు చేసిన కొత్తగా సృష్టించినా సచివాలయ ఉద్యోగులు లక్షా పాతిక వేలు ఉన్నారని గుర్తు చేస్తున్నారు. ఆర్టీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల మరో యాభై వేల మంది సిబ్బంది ఓట్లు వైసీపీకి అనుకూలం అవుతాయని వారు అంటున్నారు. అలా లెక్క వేసుకుంటే రెండు లక్షల ఓట్లు తక్కువ కాకుండా వైసీపీకి రావచ్చు అన్నది ఆ పార్టీ నేతల అంచనా. అయితే టీడీపీ కూటమి తమకు నాలుగు లక్షల దాకా ఓట్లు వస్తాయని ఆశలు పెట్టుకుంది. ఇవన్నీ ఇలా ఉంటే ఈసారి హోరా హోరీ పోరు సాగుతుంది, మెజారిటీలు కూడా వందలు పదులలో ఉన్నా ఆశ్చర్యం లేదు అంటున్నారు. దాంతో అపుడు ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అపర సంజీవిని మాదిరిగా కాపాడుతాయని అంటున్నారు. అయితే మొదట పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ చూస్తారు. కౌంటింగ్ లో లెక్క పెడతారు. దాంతో కౌంటింగ్ లో ఏ పార్టీకి అనుకూలం ఉంది. గాలి ఏ వైపు వీచింది అన్నది పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు నుంచే వెల్లడి అవుతుందని అంటున్నారు. గతసారి చూస్తే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు నుంచే వైసీపీకి పాజిటివ్ ట్రెండ్స్ స్టార్ట్ అయ్యాయి. అలా వైసీపీ వచ్చేస్తోంది అన్న ఊపు గట్టిగా కనిపించింది అని అంటున్నారు. కానీ ఈసారి అలాంటి పరిస్థితి ఉంటుందా అన్నది ఒక చర్చగా ఉంది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ తో శుభ శకునాలు ఎవరికి ఎదురైతే వారిదే విజయం అని అంటున్నారు. దానికి గతంలో లెక్కించిన ఓట్లు వాటి వివరాలు కూడా ఉన్నాయని అంటున్నారు. తెలంగాణాలో జరిగిన ఉప ఎన్నికలు సైతం పోస్టల్ బ్యాలెట్ ని బట్టే ట్రెండింగ్స్ తెలిసాయని అవి అలా లాస్ట్ దాకా కంటిన్యూ అయ్యాయని చెబుతున్నారు. ఇపుడు కూడా అదే ఊపు ఉంటుందని టీడీపీ కూటమి ఆశపడుతోంది. అయితే పోస్టల్ బ్యాలెట్ లో తక్కువ ఓట్లు వచ్చినా మిగిలిన ఓట్ల విషయంలో మెజారిటీలు మారిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయని వైసీపీ నేతలు అంటున్నారు. ఏది ఏమైనా జూన్ 4న కౌంటింగ్ స్టార్ట్ అయ్యాక అందరూ టీవీలకు అతుక్కుపోయి టోలి ట్రెండ్స్ నే ఎక్కువగా చూస్తారు. కళ్ళప్పగించి మరీ వారు చూస్తారు. అలనటి టైంలో ట్రెండ్స్ అన్నీ ఏ పార్టీకి వెళ్తాయో వారిదే విజయం అని సంబరాలు మొదలెట్టే చాన్స్ ఉంది. సో పోస్టల్ బ్యాలెట్ శకునం ఎవరికి అనుకూలంలో చూడాలంటే ఇంకా జూన్ 4 వరకూ వెయిట్ చేయాల్సిందే.



# రైతులను కుక్కలతో పోలుస్తారా?

## వ్యవసాయ మంత్రిపై హరీశ్‌రావు ఫైర్..

జగిత్యాల : వడ్లకు బోనస్ ఏమైందని అడిగితే.. వ్యవసాయ మంత్రి కొందరు మొరుగుతున్నారంటూ రైతులను కుక్కలతో పోలుస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు బాండ్ పేపర్‌పై రాసిచ్చి.. వడ్లకు బోనస్ ఇస్తామని ఇవాళ సన్నాలకు మాత్రమే ఇస్తామని ఇవాళ సన్నాయి నొక్కులు నొక్కుతున్నరు.

ఆ రోజు మీరు రాసిచ్చిన బాండ్ పేపర్‌పై సంతకాలు పెట్టారు కదా? ఈ రోజు పీసీసీ అధ్యక్షుడు, భట్టి విక్రమార్క సంతకాలు పెట్టారు. మీరు సంతకాలు పెట్టి.. నమ్మబలికి బాండ్ పేపర్లు ఇచ్చి.. చేతుల్లో పట్టుకొని ఇవాళ వడ్లకు బోనస్ ఏమందంటే చేతులెత్తేస్తున్నారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సన్నాలకు మీరు బోనస్ ఇచ్చేది ఏందీ..?** 'ఎందుకు ఇవ్వరు బోనస్? ఇవాళ జగిత్యాల జిల్లాలో రైతులతో, వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడితే జిల్లా పరిధిలో 2.97లక్షల ఎకరాల్లో యాసంగిలో వడ్ల పండితే.. 2.80లక్షల ఎకరాల్లో దొడ్డు వడ్లే ఉన్నయ్. మిగితా 17వేల ఎకరాల్లో సన్నాలు సాగు చేశారు. అవి కూడా ఇంటిమందం సన్నాలు తిండిగింజల కోసం సాగు చేశారు. దానికి మీరు బోనస్ ఇచ్చేది ఏందీ? లక్ష్మారెడ్డి అనే రైతుతో మాట్లాడితే మా జగిత్యాలలో జైశ్రీరామ్ అనే సన్నవడ్లకు బయట రూ.2800–రూ.3వేలు కొనుగోలు చేస్తున్నరు. గవర్నమెంట్ ఇచ్చేది ఏందీ? ప్రైవేటులోనే కొనుగోలు చేస్తున్నారు. అందువల్ల రూ.500 కోసం ప్రభుత్వానికి అమ్మనే అమ్మరు. ఇదంతా మోసం ఉన్నది అని రైతు లక్ష్మారెడ్డి చెబుతూ వాపోతున్నరు. వాస్తవానికి దొడ్డు రకమైతే 25–30 క్వింటాళ్లు పండుతయ్. సన్న రకాలైతే 10–15 క్వింటాళ్లు పండుతయ్. దాదాపు పది క్వింటాళ్ల వరకు దిగుబడి తక్కువ. రోగాలు, పెట్టుబడి, నెలరోజుల కాలం ఎక్కువ. మన ప్రాంతంలో రైతులు పండించేది రూపాయికి 90 పైసలు దొడ్డు రకమే ఎక్కువ. మరి సన్నాలకు బోనస్ ఇస్తామంటే.. రైతులను మోసం చేయడం, దగా చేయడం.. రైతులను గుండెలపై తన్నడం తప్ప ఇంకోటి లేదు' అన్నారు.

**మిమ్మల్ని గెలిపించి ఇందుకేనా..?** 'బాధ కలిగించే విషయం ఏంటంటే వ్యవసాయశాఖ మంత్రి అంటరు అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని కొందరు మొరుగుతున్నరు అంటున్నరు. మరి రైతులు కూడా మొరుగుతున్నట్టేనా? ఈ రైతులే చెబుతున్నరు ఈ కాంగ్రెస్ గవర్నమెంట్ మమ్మల్ని మోసం చేస్తున్నది. అంటే ఇవాళ రైతులను అవమానపరుస్తున్నారు. మీరిచ్చిన మాట అమలు చేయండంటే.. మొరుగుతున్నరు అని మాట్లాడుతున్నరి అంటున్నరు.. రైతులను కుక్కలు అంటున్నరా? మీరు. ఒక మంత్రి ఏమో రైతుబంధు ఎప్పుడు ఇస్తరు అంటే చెప్పుతో కొడుతా అంటడు. అయ్యా వడ్లకు ఎప్పుడు బోనస్ ఇస్తరు.. ఇది మోసం అంటే.. రైతులను పట్టుకొని కుక్కలతో పోలుస్తూ మొరుగుతున్నరు అంటున్నరు. మిమ్మల్ని ఇందుకేనా గెలిపించింది ? అంటూ నిలదీశారు.

**రైతులు పోరాటానికి సిద్ధమంటున్నరు..** 'రైతులందరూ ముక్తకంఠంతో చెబుతున్నరు. మేమందరం హైదరాబాద్‌కు వస్తాం. పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని చెబుతున్నరు. దీనిపై స్పందించాలి. ఇప్పుడు ఏం అంటున్నరు ? ఇప్పుడు మెల్లగా భవిష్యత్‌లో కొంటాం అంటున్నరు. ఎన్నికలకు ముందు బాండ్‌పేపర్‌పై ఏమని రాసిచ్చారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. ఇప్పుడు ఏమైందంటే దాటవేస్తున్నరు. ఇది మోసపూరిత ప్రభుత్వం. మొన్న లోక్‌సభ ఎన్నికల సమయంలో డబ్బాలో ఓటుపడేదాక ఏమీ మాట్లాడలేదు. ఇప్పుడు సన్నాలకే బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రైతులను మోసం చేస్తున్నరు. మంత్రులు మేల్కొనాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి' అని డిమాండ్ చేశారు.

# గుర్తింపు సరే.. నిధులు ఏవీ?

కరీంనగర్ : మానకొండూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమిది. ఇది 2022 మే నెలలో ఎన్‌క్వాస్‌కు ఎంపికైంది. రెండేళు కావస్తున్నా కేంద్రం ప్రకటించిన నిధులు ఇప్పటికీ విడుదల కాలేదు. నాణ్యత ప్రమాణాలు మెరుగుపడాల్సి ఉంది.

జిల్లాలో నాణ్యత ప్రమాణాలు, వైద్య సేవలు బాగున్న ఆరోగ్య కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ప్రోత్సాహకాలు అందజేస్తోంది. ఆ నిధులతో ఆసుపత్రుల పనితీరును మరింత మెరుగుపరుస్తారు. కానీ రావాల్సిన ప్రోత్సాహకాలు ఏటా విడుదల కాకపోతే ప్రమాణాలు ఎలా మెరుగు పడుతాయనేది గుర్తించడం లేదు. ఇదిలా ఉండగా.. మళ్లీ కొత్త ఆసుపత్రుల ఎంపికకు కసరత్తు చేయడం గమనార్హం. మరిన్ని వివరాలతో కథనం.

**కేంద్ర బృందం పరిశీలించి..**

ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యత ప్రమాణాలతో వైద్య సేవలు అందించడం, అవసరమైన మందులు నిల్వలు, రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం వంటి ఎనిమిది విభాగాలను పరిశీలించి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్వాస్)కు ఎంపిక చేస్తారు. కేంద్ర బృందం వచ్చి ఈ అంశాలను పరిశీలన జరిపి, ఎంపిక చేస్తుంది. ఇలా ఎంపికైన వాటికి మూడేళ్లపాటు ఏటా నిధులు విడుదల చేస్తారు. కానీ రెండేళ్లుగా నిధులు రావడం లేదు. ఆయా ఆసుపత్రుల పరిధిలో వీటిని ఖర్చు చేస్తారు.రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రమిది. 2021లో జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎన్‌క్వాస్‌కు ఎంపికైంది. దీనికి రావాల్సిన ప్రోత్సాహక నిధులు నేటికీ రాలేదు.

**ప్రోత్సాహకాలు ఇలా..**

ప్రతి ఆరోగ్య కేంద్రానికి ఏడాదికి రూ.3 లక్షల చొప్పున మూడేళ్లలో రూ.9 లక్షలు కేటాయిస్తారు.

పట్టణ ఆరోగ్య కేంద్రానికి ఏటా రూ.2 లక్షలు, మూడేళ్లకు రూ.6 లక్షలు ఇస్తారు.

పల్లె దవాఖానాలు, సబ్‌సెంటర్లకు ఏటా రూ.1.50 లక్షల చొప్పున రూ.4.50 లక్షలు మంజూరు చేస్తారు.

**జిల్లాలో అర్హత సాధించిన ఆసుపత్రులు..**

8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: రామడుగు(డిసెంబరు 2021), చల్లూరు(ఏప్రిల్ 2022), గంగాధర(ఏప్రిల్ 2022), శంకరపట్నం(జనవరి 2023), మానకొండూర్ (మే 2022), కొత్తపల్లి (డిసెంబరు 2022), గుండి (ఏప్రిల్ 2023), తిమ్మాపూర్(ఆగస్టు 2023).

7 సబ్‌సెంటర్లు, పల్లె దవాఖానాలు: ఎలబాక, దుర్శేడ్(సెప్టెంబరు 2023), కొండ పలకల, ములకనూర్ (నవంబర్ 2023), జమ్మికుంట–2(అక్టోబరు 2023), బూరుగుపల్లి(మార్చి 2024), అన్నారం (ఫిబ్రవరి 2024)కేంద్రాలు ఉన్నాయి.

పట్టణ ఆరోగ్య కేంద్రాలు: కరీంనగర్‌లోని మోతాజ్‌ఖాన(జూన్ 22), బుట్టిరాజరాంకాలనీ(ఫిబ్రవరి 23) ఆరోగ్య కేంద్రాలు ఎంపికయ్యాయి. వీటిలో గంగాధర, చల్లూరు, శంకరపట్నం, బుట్టిరాజరాంకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రానికి మాత్రమే ప్రోత్సాహక నిధులు వచ్చాయి. మిగతా వాటికి రాలేదు.

ఎంపిక కోసం ముస్తాబు : వీణవంక, చిగురుమామిడి, చామన్‌పల్లి ఆరోగ్య కేంద్రాలు, ఎరడపల్లి, గన్నేరువరం, గర్షకుర్తి పల్లె దవాఖానాలు ఎన్‌క్వాస్ ఎంపికకు ముస్తాబవుతున్నాయి.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**

జిల్లాలో ఎన్‌క్వాస్‌కు ఎంపికైన ఆసుపత్రులకు రావాల్సిన ప్రోత్సాహకాల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. కొన్నింటికి విడుదల చేశారు. మిగిలిన వాటికి నిధుల విడుదలయ్యే అవకాశముంది. వీటితో సంబంధం లేకుండా కొత్త ఆసుపత్రుల ఎంపిక కోసం చర్యలు చేపట్టాం.
డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో, కరీంనగర్

# హత్యా రాజకీయాలు మంచిది కాదు..

## మంత్రివర్గం నుంచి జూపల్లిని బర్తరఫ్ చేయాలి : కేటీఆర్




వనపర్తి : హత్యా రాజకీయాలు తెలంగాణకు మంచిది కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. నాలుగు నెలల కాలంలోనే ఇద్దరి హత్యలకు కారణమైన మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రివర్గం నుంచి సస్పెండ్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో బొడ్డు శ్రీధర్ రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. శ్రీధర్ రెడ్డి హత్యకు జూపల్లి కృష్ణారావే బాధ్యత వహించాలి. ఇది మొదటి హత్య కాదు. పేరుకేమో ప్రజాపాలన.. చేస్తున్నది ప్రతీకార పాలన. ప్రతీకారంతో రగిలిపోతూ ఎన్నికల్లో వత్తాసు పలకని వారి మీద ప్రతీకారం తీర్చుకునే దిక్కుమాలిన పాలన.. ఇది కాంగ్రెస్ పాలన. ఈ హత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. రాష్ట్రంలో ఎక్కడా లేని ఫ్యాక్షన్ సంస్కృతిని మంత్రి జూపల్లి కొల్లాపూర్‌లో తీసుకొచ్చారు. జనవరిలో మల్లేష్ యాదవ్, ఇప్పుడు శ్రీధర్ రెడ్డి హత్యకు కారణమయ్యారు జూపల్లి. ఒకటే నియోజకవర్గంలో నాలుగు నెలల వ్యవధిలో రెండు హత్యలు జరిగాయంటే మంత్రి ప్రమేయం, ప్రోద్బలం లేకుండా ఆయన అనుచరులు ఇంత దారుణాలకు తెగబడరు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మంత్రి జూపల్లిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. స్థానికంగా ఉండే పోలీసు వ్యవస్థ మీద మాకు నమ్మకం లేదు. వరుస హత్యలపై ప్రత్యేక దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయాలి. లేదంటే జ్యుడిషియల్ విచారణకు ఆదేశించాలి. ఈ హత్యల్లో ప్రభుత్వ పాత్ర, మంత్రి పాత్ర లేకపోతే నిష్పక్షపాతంగా విచారణ జరిగేందుకు సహకరించాలి. కొల్లాపూర్ ప్రాంతంలో హింసాయుతమైన సంస్కృతి కనబడుతుంది.. గ్రామీణ ప్రాంతాల్లో దాడులకు పాల్పడుతున్నారు.. చెలరేగిపోతున్నారు.. అయినా పోలీసులు ప్రేక్షపాత్ర వహిస్తున్నారు. అవసరమైతే పికెట్లు, క్యాంపులు ఏర్పాటు చేయాలని డీజీపీని మా నాయకులు కలిశారు అని కేటీఆర్ గుర్తు చేశారు. శ్రీధర్ రెడ్డి హత్యకు గురైనట్టు ఉదయం 5.30కు పోలీసులకు ఫోన్ చేస్తే గంటన్నర తర్వాత వచ్చి ప్రేక్షకపాత్ర పోషించారు. ఈ కేసులో ముందుగా ఎస్ఐని సస్పెండ్ చేయాలి. మా కార్యకర్తలు కూడా రగిలిపోతున్నారు. ఇదే దాడుల సంస్కృతి కొనసాగితే మేం కూడా నియంత్రించలేం. ఈ సంస్కృతి రాష్ట్రానికి మంచిది కాదు. ఇలాగే హత్య రాజకీయాలు కొనసాగితే మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్ల ముట్టిడికి కూడా వెనుకాడం. శ్రీధర్ రెడ్డి తండ్రిని సముదాయించలేకపోతున్నాం. శ్రీధర్ రెడ్డి హత్య వెనుకాల జూపల్లి కృష్ణారావు ఉన్నాడని కేసు పెడితే, మంత్రి పేరు ఉపసంహరించుకోవాలని పోలీసులు ఒత్తిడి తెస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. హత్యలు, దాడులు, కేసులు, సోషల్ మీడియాలో పోస్టులు పెడితే బెదిరింపులు, బైండోవర్లు ఇదేనా నీ చిల్లర రాజకీయం అని కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సంస్కృతి కొనసాగితే తెలంగాణకు మంచిదికాదు. ఈ హత్య రాజకీయాలకు తెర దించాలి. శ్రీధర్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఆగని ఇసుక దందా

పాపన్నపేట: ఇసుక అక్రమ రవాణాకు అధికారులు చర్యలు తీసుకుంటామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. వాగులు, నదులు, చెరువులను అక్రమార్కులు ఇష్టానుసారం తవ్వేస్తూ 'జలసిరి'ని తరలించి జేబులు నింపుకొంటున్నారు. పాపన్నపేట మండల పరిధి ఆరేపల్లిలో ఇదే దందా కొనసాగుతోంది. గ్రామ శివారు మంజీరా నది నుంచి వారం రోజులుగా ఇసుక రవాణా కొనసాగుతోంది. ఇందుకోసం సుమారు 200 గాడిదలను వినియోగిస్తున్నారు. నదిలో కూలీలతో తవ్వకాలు జరిపి సంచుల్లో నింపి గాడిదలపై వేసి ఒడ్డుకు తీసుకువస్తున్నారు. అనంతరం సమీపంలో ఉన్న పొలాల్లో, ఇళ్ల సమీపంలో నిల్వ చేస్తున్నారు. అదును చూసుకుని రాత్రి సమయంలో లారీల్లో బయటకు తరలించి విక్రయిస్తున్నారు. బహిరంగంగానే ఈ వ్యవహారం సాగుతున్నా, ఎవరూ పట్టించుకోవడంలేదు.

అనుమానం రాకుండా..: ట్రాక్టర్లను వినియోగిస్తే వ్యాపారం చేస్తునారని అనుమానం వస్తుందని, మూగజీవాలతో తరలించేస్తున్నారు. వాహనాలు వెళ్లే పరిస్థితి కూడా ఉండకపోవడంతో ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే గ్రామంలో గృహ అవసరాల కోసం అంటూ బదులిస్తున్నారు. దీంతో అధికారులు సైతం వదిలేస్తున్నారు.



దీనినే ఆసరాగా చేసుకుని దందా చేస్తున్నారు. ఒక ట్రాక్టర్ లోడ్ ఇసుకను నది నుంచి బయటకు తీసుకువచ్చినందుకు గాడిద గుంపులకు రూ.2వేల వరకు యజమానులకు చెల్లిస్తున్నారు. ట్రాక్టర్ లోడ్ ఇసుకను బయటకు రూ.4వేల నుంచి రూ.7వేలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు మండల పరిధి ఎన్కేపల్లి, గాజులగూడెం, చిత్రియాల, కొడుపాక, పొడ్చన్‌పల్లి, గాంధారిపల్లి, తదితర గ్రామాల మంజీరా తీరం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆరేపల్లిలో ఇసుక తవ్వకాల విషయం మా దృష్టికి రాలేదని పాపన్నపేట తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు అన్నారు. వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# సరికొత్త గరిష్ఠాలకు నిఫ్టీ.. సూచీల లాభాల పరుగుకు కారణాలేంటీ..?

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు.. ఒక్కసారిగా భారీ లాభాల్లోకి దూసుకెళ్లాయి. సెన్సెక్స్ వెయ్యికి పైగా పాయింట్ల లాభంతో ట్రేడవుతుండగా.. నిఫ్టీ సరికొత్త జీవనకాల గరిష్ఠాలను నమోదు చేసింది.

మధ్యాహ్నం 2.20 గంటల సమయానికి సెన్సెక్స్ 1109 పాయింట్ల లాభంతో 75,330 వద్ద, నిఫ్టీ 329 పాయింట్లతో 22,927 పాయింట్ల వద్ద కొనసాగుతున్నాయి.

**కారణాలు ఇవే..** ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ అంచనాలను మించి ఆర్‌బీఐ తాజాగా కేంద్రానికి డివిడెండ్ ప్రకటించడం సూచీల పరుగుకు కారణమైంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.2.11 లక్షల కోట్లను ఆర్‌బీఐ ప్రభుత్వానికి అందించనుంది. ఇది కేంద్రం ద్రవ్యలోటు పూడ్చుకోవడానికి ఉపయోగపడనుంది.

గత కొన్ని రోజులుగా ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలకు దిగారు. తాజాగా దేశీయ మదుపర్లతో పోలిస్తే వారే ఇప్పుడు కొనుగోళ్లు చేపట్టడం సూచీల పరుగుకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

తాజాగా హెచ్ఎస్‌బీసీ వెలువరించిన డేటా కూడా సూచీలు రాణించడానికి మరో కారణం. దేశంలో ఎగుమతులు పెరిగాయని, మే నెలలో ఉద్యోగ కల్పన 18 ఏళ్ల గరిష్ఠానికి చేరడమూ మరో సానుకూలాంశమని నిపుణులు భావిస్తున్నారు.

## ఉప ఎన్నికల సమరం.. రసవత్తరం

కొత్తగూడెం : ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్‌కు అధికారులు సమాయత్తమవుతున్నారు. మరోవైపు అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయటంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఎమ్మెల్సీగా గెలుపొందినవారు 2027 మార్చి వరకు పదవిలో కొనసాగనున్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో 52 మంది నిలిచారు. ఖమ్మం జిల్లాలో 118.. భద్రాద్రిలో 55 పోలింగ్ కేంద్రాలు ఉప ఎన్నిక పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు జరగనుంది. బ్యాలెట్ పద్ధతిలో ఎమ్మెల్సీని ఎన్నుకోవాల్సి ఉంటుంది. అందుకు తగ్గట్టుగా బ్యాలెట్ బాక్స్‌లను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఓటర్ల తుది జాబితాను ఇదివరకే ప్రకటించారు. ఖమ్మం జిల్లాలో 118, భద్రాద్రి జిల్లాలో 55 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా జిల్లాలకు వరుసగా 140, 69 బ్యాలెట్ బాక్స్‌లను సమకూర్చనున్నారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్, భద్రాద్రి జిల్లాలోని రామచంద్ర డిగ్రీ కళాశాలలో పోలింగ్ సామగ్రి సిబ్బందికి అందించనున్నారు. పోలింగ్ ముగిసాక బ్యాలెట్ బాక్స్‌లను నల్గొండకు తరలిస్తారు. ఇందుకు సంబంధించి వాహనాలు, భద్రత సిబ్బందిని కేటాయించారు.

సిబ్బంది నియామకం

పోలింగ్ కేంద్రాల సంఖ్యకు 20 శాతం అదనంగా సిబ్బందిని అధికారులు నియమించారు. ఖమ్మం జిల్లాలో 142 మంది ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు), 142 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓలు,) 284 మంది ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓలు), భద్రాద్రి జిల్లాలో 66 మంది పీఓలు, 66 మంది ఏపీఓలు, 136 మంది ఓపీఓలు విధులు నిర్వర్తించనున్నారు. పోలింగ్ నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనీల ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చి వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ తీరును గమనించనున్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు సెక్టోరల్ అధికారులు, సూక్ష్మపరిశీలకులు, నోడల్ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటారు.

ముమ్మరంగా ప్రచారం

ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై ప్రధాన పార్టీలు దృష్టి కేంద్రీకరించాయి. 52 మంది పట్టభద్రులు బరిలో నిలవగా ప్రధానంగా మూడు పార్టీల మధ్యే హోరాహోరీ పోటీ నెలకొంది. రాష్ట్రంలో ఇటీవల అధికారంలోకి వచ్చి జోష్ మీదున్న కాంగ్రెస్ పార్టీ.. ఈసారి ఎలాగైనా ఈస్థానంలో సత్తా చాటాలని భావిస్తోంది. మరోవైపు సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు భారాస పావులు కదుపుతోంది. గత ఎన్నికల్లో మెరుగైన ఓట్లు సాధించామని, ఈసారి పాగా వేయాలనే తలంపుతో భాజపా వ్యూహాలు రచిస్తోంది. కాంగ్రెస్ తరఫున తీన్మార్ మల్లన్న, భారాస నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, భాజపా తరఫున గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి బరిలో నిలిచారు.

## పాతాళానికి పరుగులు

ఖమ్మం : గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు, ఇటీవల మండే ఎండలకు జిల్లాలో భూగర్భ జలం పాతాళానికి పరుగులు తీస్తోంది. చెరువులు, కుంటల్లో నీటి జాడ లేక పూర్తిగా ఎండిపోవడంతో జిల్లావ్యాప్తంగా భూగర్భ జలమట్టం పడిపోయింది. గతేడాది ఏప్రిల్‌లో జిల్లాలో సరాసరి 5.68 మీటర్ల లోతులో నీరుంటే ఈ ఏడాది ఏప్రిల్‌లో 7.56 మీటర్ల లోతుకు పడిపోయింది. అంటే 1.88 మీటర్ల కిందికి వెళ్లింది. గత మార్చిలో 6.86 మీటర్ల లోతులో నీరు అందుబాటులో ఉండగా గత ఏప్రిల్‌లో 7.56 మీటర్లకు తగ్గింది. అంటే నెల రోజుల్లో 0.70 మీటర్ల లోతుకు నీరు పడిపోయింది. జిల్లావ్యాప్తంగా 66 నీటి వనరుల్లో ఫీజో మీటర్లు అమర్చి ప్రతినెలా భూగర్భ జలమట్టం లెక్కిస్తుంటారు. కమాండ్ ఏరియాలో 39, నాన్ కమాండ్ ఏరియాలో 27 ఫీజో మీటర్లు అమర్చారు. భూగర్భ జలమట్టం పడిపోతున్నా 58 ఫీజో మీటర్ల పరిధిలో పరిస్థితి సేఫ్ జోన్‌లో ఉండగా, నాలుగు ఫీజో మీటర్ల పరిధిలో సెమీ క్రిటికల్, మరో నాలుగు ఫీజో మీటర్ల పరిధిలో క్రిటికల్‌గా ఉన్నట్లు భూగర్భ జల శాఖ అధికారులు తమ నెలవారీ నివేదికలో ప్రస్తావించారు. మే నెలలో మరింత లోతుకు భూగర్భ జలాలు దిగిపోయే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## పునాది దశ దాటని వంతెన

అశ్వాపురం : అశ్వాపురం మండలం గొందిగూడెం ఇసుక వాగుపై వంతెన ఈఏడాది వర్షాకాలంలోనూ అందుబాటులోకి రాకపోవచ్చు. పనులు ప్రారంభించి ఏడాది గడిచినా పునాది దశ దాటలేదు. ఏటా వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో గొందిగూడెం, కొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతులగూడెం పంచాయతీలు, ఆవాస ప్రాంతాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. వంతెన నిర్మాణానికి గతేడాది మే29న శంకుస్థాపన చేశారు. పునాదుల తవ్వకం పనులు చేపట్టారు.



వర్షాలు మొదలవటంతో పనులు నిలిచిపోయాయి. వర్షాకాలం ముగిసి తిరిగి పనులు ప్రారంభమవగానే శాసనసభ ఎన్నికలు వచ్చాయి. తర్వాత ప్రభుత్వం మారింది. ప్రత్యేక నిధులతో చేపట్టిన అనేక పనులను నూతన సర్కారు రద్దు చేసింది. ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన ఈ వంతెన నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయి. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం తాజా ఆదేశాలు ఈ వంతెన నిర్మాణానికి అడ్డంకి కాబోవని అధికారులు గుర్తించారు. అంతలోపే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. రూ. 7 కోట్ల అంచనాతో చేపట్టిన వంతెన పనులకు ఇప్పటివరకు రూ. 2.50కోట్లు ఖర్చయ్యాయి. ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ డీఈ వి.వెంకటేశ్వరరావు స్పందిస్తూ ఎన్నికలు, నిధుల విడుదలలో జాప్యం, తదితరాలతో నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందన్నారు. శీతాకాలంలోగా వంతెన పూర్తవుతుందని తెలిపారు.

# నట్టేట ముంచే నకిలీలలు



కొత్తగూడెం :'గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులైన రైతులే లక్ష్యంగా కొందరు వ్యాపారులు, డీలర్లు నాసిరకం విత్తనాలు అంటగడుతున్నట్లు లోగడ టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో తేలింది.'

కొద్దిరోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభంకానుంది. ఈ ఏడాది సాగుకు సానుకూల వాతావరణం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితులతో పంట నష్టపోయిన అన్నదాతలు ఈసారైనా కాలం కలిసొస్తుందన్న కోటి ఆశలతో ఉన్నారు. కొందరు పొడి దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. మరికొందరు యంత్ర సామగ్రిని సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో విత్తన సేకరణ కీలకంగా మారుతోంది.

రెండేళ్లుగా నకిలీ విత్తన సమస్య మళ్లీ తీవ్ర రూపం దాల్చింది. రాష్ట్రంలోనే పత్తి, మిరప, వరి ఎక్కువగా సాగయ్యే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో నకిలీ విత్తనాల బెడద రైతులను నట్టేట ముంచేస్తోంది. రూ.వందల కోట్లల్లో పంట, పెట్టుబడి నష్టాల్ని కలగజేస్తోంది. గత వర్షాకాలంలో వివిధ ప్రాంతాల్లో నకిలీ విత్తనాల విక్రయదారులను పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు పట్టుకున్నారు. ధర తక్కువ ఆశజూపి.. ఆకట్టుకునే ప్యాకెట్లలో పసలేని విత్తనాలను విక్రయిస్తున్న ఉదంతాలు వెలుగుచూసిన విషయం విదితమే. దందా నడిపేవారు మే, జూన్ మాసాల్లోనే సంచులను మార్కెట్‌కు సరఫరా చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ పరిశీలనలో తేలింది. ఈ క్రమంలో ముందే ఇలాంటి వారిపై నిఘా పెట్టాలన్నది రైతుల డిమాండ్. నాణ్యమైన విత్తనాల ఎంపికపై స్థానిక వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలతో అవగాహన సదస్సులు నిర్వహించాలి.

ఇవీ.. అక్రమార్కుల అడ్డాలు

ఖమ్మం జిల్లా..ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, కామేపల్లి, కారేపల్లి, ఏన్కూరు, వైరా, తల్లాడ, కొణిజర్ల, బోనకల్లు, చింతకాని తదితర మండలాల్లో నకిలీల విత్తనాలు ఎక్కువగా విక్రయిస్తున్నట్లు వ్యవసాయ శాఖ తనిఖీలో తేలింది.

భద్రాద్రి కొత్తగూడెంలో..సుజాతనగర్, చంద్రుగొండ, ఇల్లెందు, ఆళ్లపల్లి, గుండాల, టేకులపల్లి, భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాల్లో పత్తి, మిరప, కూరగాయల రకాల నకిలీ విత్తనాల సంచులను అంగట్లో సరకు మాదిరిగా విక్రయిస్తుండటం గమనార్హం.

ముందే మేల్కొంటే మేలు

నకిలీ విత్తన దందాను నిరోధించేందుకు గతంలో ప్రభుత్వం వానాకాలం సీజన్‌కు ముందే టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ బృందాలను అప్రమత్తం చేసేది. అధికారులు నిఘా పెంచి తనిఖీలు చేపట్టేవారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఇలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు. నకిలీ విత్తనాలు మార్కెట్‌ను ముంచెత్తే పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లోంచి ఇప్పటికే సరకు రహస్య ప్రాంతాలకు తరలించి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లోనూ విత్తన బుకింగ్‌ల హడావుడి మొదలైనట్లు సమాచారం. అధికారులు ఇకనైనా నిఘా వ్యవస్థను పటిష్ఠపరచాలి.

ఎక్కడ్నుంచి సరఫరా?

ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు ఎక్కువగా మహారాష్ట్ర, గుంటూరు, ప్రకాశం, కర్నూలు తదితర ప్రాంతాల్లోంచి ఊరూపేరూ లేని విత్తన సంచులు సరఫరా అవుతున్నాయి. కొందరు అక్రమార్కులు స్థానిక జిన్నింగు మిల్లుల్లో పత్తి నుంచి గింజలు వేరుచేస్తున్నారు. వాటిని శుభ్రపరిచి, రంగు పులిమి, ఆకర్షణీయ ప్యాకెట్లలో లేదా వస్త్ర సంచుల్లో తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఎక్కువగా గ్రామీణులు, గిరిజనులు అవగాహన లేక వీటిని కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోతున్నారు.

రైతులూ.. కనీస జాగ్రత్తలు మరవొద్దు – ఎం.విజయనిర్మల, డీఏఓ, ఖమ్మం

వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. గ్రామాల్లో రాత్రికి రాత్రి వచ్చి విక్రయించే నకిలీ విత్తనాల జోలికెళ్లొద్దు. 'బీజీ–3' పేరుతో ఉన్న హెచ్‌టీ పత్తి విత్తనాలకు అనుమతి లేదు. విత్తన కంపెనీ పేరు, రకం, లాట్ నంబరు, గడువు తేదీ వంటివి సరిచూసుకుని, డీలర్ సంతకంతో రసీదు తీసుకుంటే నష్టపరిహారం పొందేందుకు భరోసా ఉంటుంది. వస్త్ర సంచుల్లో, లేదా లూజ్ మాల్‌ను కొనొద్దు. విత్తనాలు నాటాక ఆయా ప్యాకెట్లను భద్రంగా దాచుకోవాలి. బీటీ కాటన్ సాగుచేసే వారు జీఈఏసీ అప్రూవల్ నంబరు, తేదీ, సదరన్ జోన్.. అంటే తెలంగాణలో సాగుకు అనువైందో కాదో పరిశీలించుకోవాలి. రాయితీలు, బహుమతులకు తలొగ్గి కల్తీల బారినపడితే పంట నష్టపోవాల్సి వస్తుంది. అనుమానం ఉంటే సమీప వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

# ఖాళీ స్థలాలు.. సమస్యలకు నిలయాలు



జనగామ : జనావాసాల్లో ఖాళీ స్థలాలు మురికి నీటితో కుంటలుగా మారి, కంపు కొడుతున్నాయి. యజమానుల నిర్లక్ష్యం అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలకు పాట్లు తప్పడం లేదు. వర్షాకాలం ముందే వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటీవల నాలుగైదు పెద్ద వానలు కురిశాయి. ఇప్పటికే జనగామ పట్టణంలో వరద సమస్య ప్రారంభమైంది.

కట్టరు.. పట్టించుకోరు:

భావి అవసరాల దృష్ట్యా కొందరు ఇళ్ల స్థలాలను కొని వదిలేస్తున్నారు. ఆయా కాలనీల్లో గృహ నిర్మాణాలు ఊపందుకుని, ప్లాట్లకు విలువ పెరిగిన పిదప చూద్దాంలే అనుకొని ఏళ్ల తరబడి వదిలేయడంతో చెత్త, ముళ్లకంప చెట్లు పెరిగి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. వర్షాకాలంలో మురుగు, వరద నీరు ప్లాట్లలోకి చేరి మురుగునీటి మడుగులుగా మారుతున్నాయి. జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీ, సాయినగర్, శ్రీవిల్లాస్ కాలనీ, జీఎంగోకుల్‌నగర్, బాలాజీనగర్, జ్యోతినగర్, ప్రగతినగర్, దుర్గానగర్, శామీర్‌పేట తదితర 20 ప్రాంతాల్లో ఆవాసాల మధ్య ఖాళీ స్థలాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి.

రిజిస్ట్రేషన్‌తో సరి

ప్లాట్లు ఖరీదు చేసేవారు రిజిస్ట్రేషన్ అనంతరం, మున్సిపల్‌లో తమ పేరిట ఆస్తి మార్పిడి చేయించుకోవాలి. దీని వల్ల డబుల్ రిజిస్ట్రేషన్ ప్రమాదాన్ని నివారించవచ్చు. ఆస్తి మార్పిడితో, సదరు స్థలం ఆస్తి పన్ను పరిధిలోకి వస్తుంది. దీన్ని తప్పించుకునేందుకు మ్యుటేషన్‌కు దూరంగా ఉంటున్నారని అధికారులు అంటున్నారు. ఖాళీ స్థలాల మ్యుటేషన్, అసెస్‌మెంట్‌పై దృష్టిసారిస్తే, ఖాళీ స్థలాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారికి నోటీసులు జారీ చేయవచ్చు. నోటీసుకు స్పందించని చోట, మున్సిపల్ ఆధ్వర్యంలో శుభ్రపర్చి సదరు ఖర్చులను వసూలు చేసే అవకాశం ఉంది. అప్పటికీ స్పందించని పక్షంలో స్వాధీనం చేసుకుని, రుసుము చెల్లించేదాకా నిర్మాణ అనుమతులను నిరాకరించవచ్చు. నిబంధనల అమలుపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.

ప్రభుత్వ స్థలాల్లోనూ ఇదే పరిస్థితి..

ప్రైవేటు ప్లాట్ల సంగతి ఇలా ఉంటే, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, అంతర్గత, ప్రధాన రహదారుల వెంట ఉన్న గ్రీన్‌బెల్టు తదితర స్థలాలు చెత్తకుండీలుగా, మురుగునీటి నిలయాలుగా మారుతున్నాయి. గుండ్లగడ్డ కబేలా నుంచి పాలకేంద్రం వరకు 60 అడుగుల రహదారి, రైలు పట్టాల మధ్య ఖాళీ స్థలం అనేక చోట్ల డంపుయార్డును తలపిస్తుంది. పందులు, కుక్కలకు ఈ ప్రాంతాలు ఆవాసాలుగా మారుతున్నాయి. నిర్మాణ వ్యర్థాలను, భోజన, ప్లాస్టిక్ వ్యర్థాలను ఈ దారిలో డంపు చేస్తున్నారు. ప్రతి ఏటా పట్టణ ప్రగతి, ఇతర ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు సందర్భంగా వీటిని శుభ్రం చేసేందుకు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. చినుకుపడితేజిపట్టణం ఎగువన ఉన్న చెరువు, కుంటలు నిండి పొర్లినపుడు తూర్పు వైపు ఉన్న కాలనీలకు వరద ముప్పు పొంచి ఉంది. ఇలాంటి చోట్ల వర్షాకాలం అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. "ఫ్రైడే.. డ్రైడే" వంటి పథకాలు నినాదాలకే పరిమితమవు తున్నాయి. మురికినీటి మడుగులుగా మారిన ప్లాట్లు దోమలకు అడ్డాగా మారుతున్నాయి. ఈ వానాకాలంలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.

## స్థిరాస్తి వ్యాపారానికి ఛార్జీల పెంపు గుబులు

మహబూబాబాద్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో రిజిస్ట్రేషను ఛార్జీల పెంపుపై కసరత్తు ప్రారంభమైంది. ఇప్పటికే వ్యాపారం లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో భూమి విలువ పెంచితే అది ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. మధ్యతరగతి వారిపై మరింత ఆర్థిక భారం పడనుంది.

ఒకేసారి భారీగా.. గత ప్రభుత్వం 2021లో ఒకేసారి భారీగా రిజిస్ట్రేషన్లు, భూముల విలువను పెంచింది. అంతకు ముందు రిజిస్ట్రేషను ఛార్జీలు 6 శాతం ఉండగా 7.5 శాతానికి అంటే 1.5 శాతం పెరిగింది. దీనికి తోడు మార్కెట్ విలువను కూడా పెంచడంతో కొన్ని చోట్ల ఛార్జీలు రెట్టింపు అయ్యాయి. ఉదాహరణకు కాజీపేట మండలం ప్రశాంత్‌నగర్‌లో మార్కెట్ విలువ రూ.3 వేల నుంచి ఒకేసారి 9 వేలకు పెరిగింది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కనీస ధర రూ. 2,500 ఉంది. అంటే ఎక్కడ భూమి కొన్నా రూ.90 వేల నుంచి రూ.లక్షకు పైగా ఖర్చు అవుతోంది.

తగ్గిన వ్యాపారం.. కరోనా తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 సబ్ రిజిస్ట్రేషను కార్యాలయాల్లో భారీ ఎత్తున రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఏటా రూ.350 కోట్లకు పైగా ఆదాయం వచ్చేది. గతేడాది ఆదాయం రూ.334 కోట్లకు పడిపోయింది. ఈ సంవత్సరం ఎన్నికలు, ప్రభుత్వ మార్పు, ప్రవాస భారతీయులలో కొనుగోలు ఆసక్తి తగ్గిపోవడం, విదేశాలలో ఉద్యోగాల ఊగిసలాటల ప్రభావం తీవ్ర ప్రభావం చూపింది. ఈ సమయంలో ఛార్జీలు పెంచితే వ్యాపారం మరింత తగ్గే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.ప్రతి సంవత్సరం పెంపు – హరికోట్ల రవి, జిల్లా రిజిస్ట్రారు

ప్రతి సంవత్సరం రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు ఉంటుంది. 2021 నుంచి పెంపు జరగలేదు. ఈ సంవత్సరం ఆగస్టు 1 నుంచి పెంచే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కసరత్తు చేస్తున్నాం. మూడేళ్ల నుంచి పెంపు లేదు కాబట్టి దానికి అనుగుణంగా, శాస్త్రీయంగా ఉంటుంది.

నగరంలో స్థలం కొనలేరు – రియల్ వ్యాపారి గోకె కరుణాకర్

ఇప్పటికే నగరంలో మార్కెట్ విలువ ఎక్కువగా ఉంది. ఇంకా పెంచితే మధ్యతరగతి వారు నగరంలో స్థలం కొనలేని పరిస్థితి ఏర్పడుతుంది. గతంలో స్వల్పంగా ఛార్జీలు పెంచేవారు.. ఒకే సారి రూ.వేలల్లో పెంచడం వల్ల ఆర్థిక భారం ఎక్కువవుతుంది.

## మాతృక.. గిరిపుత్రులకు బాసట..!

చర్ల : రెవెన్యూ భూములు కాకుండా.. అటవీశాఖకు సంబంధం లేని మాతృక భూములను భూమిలేని అత్యంత నిరుపేద గిరిజనులకు పంపిణీ చేస్తే వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయి. చర్ల మండలంలోని వివిధ గ్రామాల్లో ఇలాంటి భూములు దాదాపు వెయ్యి ఎకరాల వరకు పడావుగా ఉన్నాయి. నిరుపేద గిరిజనులకు అసైన్డ్ భూములను ఇప్పటికే వివిధ గ్రామాల్లో పంపిణీ చేసిన అధికారులు వారిని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయించారు.

అప్పటి కలెక్టర్ చొరవతో..

చర్ల మండలంలోని మారుమూల బత్తినపల్లికి చెందిన 95 మంది గిరిజనులకు అప్పటి కలెక్టర్ అనుదీప్ చొరవతో గ్రామంలోని 311 ఎకరాలు, పులిగుండాలలో 291 ఎకరాల్లో అసైన్డ్ భూములకు స్థానిక అధికారులు పట్టాలు జారీ చేశారు. గిరిజనుల దశబ్దాల కల నెరవేరింది. గత మూడు దశాబ్దాలుగా వారు ఆ భూములకు పట్టాలు జారీ చేయాలని కోరుతూనే వచ్చారు. ఈ సమస్యపై అప్పట్లో 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో అప్పటి జిల్లా పాలనాధికారి అనుదీప్ స్పందించడంతో గిరిజనుల జీవిత కల సాకారమైంది. అలానే మండలంలోని వివిధ గ్రామాల్లో మాతృక



భూములను భూమిలేని తమకు పంపిణీ చేయాలని నిరుపేదలు వేడుకుంటున్నారు.

కూలీ పనులే దిక్కు..మండలంలోని తిప్పాపురం, పూసుగుప్ప, ఉంజుపల్లి, వద్దిపేట, లెనిన్‌కాలనీ, సింగసముద్రం, కొయ్యూరు, సుబ్బంపేట, పెదమిడిసిలేరు, చినమిడిసిలేరు, కొత్తగట్ల, శ్రీనివాసపురం, కుదునూరు తదితర గ్రామాల్లో నిరుపయోగంగా మారిన మాతృక భూములతో పాటు అసైన్డ్ భూముల సర్వే అనంతరం పేదలకు పంపిణీ చేయొచ్చు. ఆయా గ్రామాల్లో అత్యంత నిరుపేదలు ఇప్పటికీ కూలీ పనులే జీవనంగా బతుకీడ్చుతున్నారు. వీరందరికీ భూ పంపిణీ జరగలాంటే.. కలెక్టర్ చొరవతోనే సాధ్యమవుతుంది. ఓ పక్క ప్రభుత్వం పోడుభూములకు హక్కులు కల్పించడం ద్వారా మన్యంలో వేలాది గిరిజన కుటుంబాలు లబ్ధి పొందాయి. అదేవిధంగా మాతృక భూములనూ పేద గిరిజనులకు పంపిణీ చేస్తే వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సన్నద్ధం

మహబూబాబాద్ : జిల్లాలో ఇంకా ఎన్నికల వాతావరణం కొనసాగుతూనే ఉంది. వారం రోజుల కిందట లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. ఈనెల 27వ తేదీన నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నిక నిర్వహణకు సందడి ప్రారంభమైంది. ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల విజయం కోసం విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. అధికార యంత్రాంగం తమ విధి నిర్వహణలో భాగంగా జిల్లాలోని 18 మండలాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు చేపట్టారు.

మూడు ఉమ్మడి జిల్లాల్లో 4,61,786 మంది ఓటర్లుగా నమోదుకాగా మహబూబాబాద్ జిల్లాలో 34,933 మంది ఉన్నారు. పురుషులు 22,948 మంది, మహిళలు 11,985 మంది ఉన్నారు.


ప్రతి మండల కేంద్రంలో ఆ మండలాల పరిధిలోని ఓటర్లు తమ హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలను నెలకొల్పారు. 18 మండలాల్లో 36 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ముఖ్యంగా మహబూబాబాద్‌లో అధికంగా ఐదు పోలింగ్ కేంద్రాలుండగా తొర్రూరు, మరిపెడలో నాలుగు ఏర్పాటు చేశారు. మరో ఎనిమిది మండలాల్లో రెండు చొప్పున మిగిలిన ఏడు మండలాల్లో ఒక్కో పోలింగ్ కేంద్రాన్ని నెలకొల్పారు. ఈ నెల 27న నిర్వహించనున్న పట్టభద్రుల ఉప ఎన్నికలో విధులు నిర్వహించే అధికారులకు శిక్షణ ప్రక్రియను ప్రారంభించనున్నారు.

మహబూబాబాద్ డివిజన్ పరిధిలోని మండలాలకు జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్, తొర్రూరు డివిజన్ పరిధిలోని మండలాలకు తొర్రూరులోని జడ్పీహెచ్‌ఎస్‌లో పోలింగ్ సామగ్రిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పార్టీలు



ఎమ్మెల్సీ ఉప ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారాస అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. ఆయన జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో కాంగ్రెస్, భాజపా, భారాస పార్టీలు ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు తమ ప్రచారాన్ని ముమ్మురం చేశారు. పట్టభద్రుల నియోజకవర్గానికి నాలుగుసార్లు ఎన్నిక నిర్వహించగా భారాస అభ్యర్థులే విజయం సాధించారు. ఆ పట్టును నిలుపుకొనేందుకు భారాస విశ్వప్రయత్నం చేస్తుంది. భారాస నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డిని పోటీలో నిలిపారు. గతంలో పోటీ భాజపా అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మరోసారి పోటీ చేస్తున్నారు. నాటి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తీన్మార్ మల్లన్న ఈ సారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.




## సంచలన విషయాలు వెలుగులోకి, అడ్డంగా దొరికిపోయిన హేమ

బెంగుళూరు శివార్లలో జరిగిన రేవ్ పార్టీలో రోజు రోజుకీ కొన్ని సంచలన విషయాలు బయటపడుతున్నాయి. బెంగుళూరు పోలీసులు ఆ పార్టీలో పాల్గొన్నా వారందరి రక్త నమూనాలు సేకరించి పరీక్షకి పంపించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అందులో టాలీవుడ్ నటి హేమ రక్త నమూనాల్లో డ్రగ్స్ ఉన్నట్లు నార్కొటిక్ టీమ్ పేర్కొంది. ఇప్పుడు ఈ విషయంతో రేవ్‌పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని హేమ చెప్పిన మాటలు అన్ని అబద్దాలే అని తెలిపోయింది. ఈ రేవ్ పార్టీ తరువాత హేమ తాను అక్కడ లేనట్టుగా చిత్రీకరించడానికి బిర్యానీ ఎలా చేస్తారు లాంటి మామూలు వీడియోలు విడుదల చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చాలా ప్రయత్నాలు చేసింది. కానీ ఇప్పుడు ఆమె రక్త నమూనాలో మాదకద్రవ్యాలు తీసుకున్నట్టుగా రూడీ అవటంతో ఇక ఆమె ఎన్ని చెప్పినా, ఆమె ఆ పార్టీలో వుంది, మాదకద్రవ్యాలు సేవించింది అనే విషయం స్పష్టం అయింది. 'సన్ సెట్ టు సన్ రైజ్ విక్టరీ' పేరుతో బెంగుళూరు ఎలక్ట్రానిక్ సిటీ జీఆర్ ఫామ్ హౌస్‌లో గత ఆదివారం రేవ్‌పార్టీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ రేవ్‌పార్టీలో పాల్గొన్న 103 మంది రక్త నమూనాలను ఇటీవల బెంగళూరు నార్కొటిక్ టీమ్ సేకరించింది. 103 మందిలో మొత్తం 86 మంది డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. 59 మంది పురుషుల, 27 మంది మహిళల రక్త నమూనాలు పాజిటివ్ అని తేలింది. నటి హేమ కూడా డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. రక్త నమూనాలు పాజిటివ్‌గా తేలిన వారందరికీ సీసీబీ సమన్లు ??జారీ చేయనుంది. అదే రేవ్‌పార్టీ జరిగిన ఫామ్‌హౌస్‌లోనే నటి హేమ ఉందని, ఆమె వీడియో అక్కడే రికార్డ్ చేసిందని బెంగళూరు పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు. తాను రేవ్‌పార్టీలో పాల్గొనలేదని, ఆ సమయంలో హైదరాబాద్‌లోనే ఉన్నానని హేమ అప్పట్లో ఓ వీడియో విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే రేవ్‌పార్టీకి తాను వెళ్లలేదంటూ రిలీజ్ చేసిన వీడియోలో ఆమె ఏ డ్రస్‌తో ఉన్నారో, బెంగళూరు పోలీసులు విడుదల చేసి ఫొటోలోనూ అదే డ్రస్‌లో ఉన్నారు. దాంతో హేమ చెప్పేది అబద్ధం అని అప్పుడే స్పష్టం అయింది. అయినా కూడా హేమ తాను హైదరాబాద్‌లోనే ఉన్నానంటూ మరో వీడియో వదిలారు. చివరకు బ్లడ్ శాంపిల్స్ పాజిటివ్‌గా రావడంతో ఆమె బండారం బయటపడింది.

## బాంబు బెదిరింపులు.. వణుకుతున్న బెంగళూరు!

బెంగళూరు: దేశంలోని ప్రముఖ నగరాల్లో బాంబు బెదిరింపులు ఆగడంలేదు. తాజాగా కర్ణాటక రాజధాని బెంగళూరులోని ప్రముఖ హెూటల్ ఒట్టేరా సహా మరో రెండింటికి బెదిరింపులు వచ్చాయి. ఒక ఈ-మెయిల్ అడ్రస్ నుంచి ఇవి వచ్చినట్లు ఆయా యాజమాన్యాలు తెలిపాయి. నేడు ఆ హెూటళ్లు పేల్చివేస్తామని దీనిలో హెచ్చరించారు.



సమాచారం అందుకున్న భద్రతా బలగాలు రంగంలోకి దిగి ముమ్మర తనిఖీలు చేపట్టాయి. వీటి సమీప ప్రాంతాల్లో భారీ స్థాయిలో పోలీసులను మోహరించారు. ఇంతవరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువులను గుర్తించలేదని.. తనిఖీలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

గతంలోనూ బెంగళూరులోని 40కి పైగా పాఠశాలలకు బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపింది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలోని వందకు పైగా స్కూళ్లకు ఈ తరహా బెదిరింపులే వచ్చిన విషయం తెలిసిందే. నాడు అనుమానిత వస్తువులు లభ్యం కాకపోవడంతో అదంతా బూటకమని తేలింది. కొన్ని గంటల క్రితమే నార్త్ బ్లాక్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఈ-మెయిల్ బెదిరింపు వచ్చింది. కానీ, అక్కడ ఎటువంటి అనుమానిత వస్తువులు గుర్తించలేదు.

## వనపర్తి జిల్లాలో బీఆర్ఎస్ నాయకుడి దారుణ హత్య.


వనపర్తి జిల్లాలో బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి (45)

దారుణహత్యకు గురయ్యారు. కొల్లాపూర్ నియోజకవర్గం చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో గత అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. రాత్రిపూట ఆరుబయట నిద్రిస్తున్న ఆయనను గుర్తుతెలియని వ్యక్తులు గొడ్డలితో తల నరికి చంపేశారు. మృతుడు శ్రీధర్‌రెడ్డి కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు. హత్యపై హర్షవర్ధన్ రెడ్డి స్పందించారు. రాజకీయ కక్ష్యతోనే శ్రీధర్‌రెడ్డిని హత్య చేశారని ఆయన ఆరోపించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయన్నారు. ఇటీవల బీఆర్ఎస్ మద్దతుదారులపై వరుసగా దాడులు జరుగుతున్నాయని హర్షవర్ధన్‌రెడ్డి చెప్పారు. దీనిపై డీజీపీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కాగా ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194




## టీమ్‌గా మంత్రులు, కెప్టెన్ అతనే.. జగ్గారెడ్డి సంచలనం

హైదరాబాద్: తెలంగాణ మంత్రులు అంతా కలసి కట్టుగా ఉన్నారని, నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. మా కెప్టెన్ సీఎం రేవంత్ రెడ్డి అని తేల్చి చెప్పారు. రేవంత్ నేతృత్వంలో గల టీమ్ ప్రజల కోసం పనిచేస్తుందని జగ్గారెడ్డి వివరించారు. ఐదేళ్లు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని స్పష్టం చేశారు. అందులో సందేహాలకు తావులేదని తెలిపారు. తమ ప్రభుత్వాన్ని వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని తేల్చి చెప్పారు. కొందరు కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డిపై జగ్గారెడ్డి విరుచుకుపడ్డారు. మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డిపై అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమీ లేకున్నా.. ఆరోపణలు చేయడం కరెక్ట్ కాదని సూచించారు. ఉత్తమ్ కుమార్ తెల్లని కాగితం వంటి వారని, అనవసరంగా ఎందుకు ఇంకు చల్లుతారని అడిగారు. బట్ట కాల్చి ఉత్తమ్ మీద వేయడం కరెక్ట్ కాదని మహేశ్వర రెడ్డికి సూచించారు. ఉత్తమ్‌ను ఇబ్బంది పెట్టడంలో మహేశ్వర రెడ్డికి ఒనగూరే ప్రయోజనం ఏంటో అర్థం కావడం లేదన్నారు. బీజేఎల్పీ నేత అయినప్పటికీ మహేశ్వర రెడ్డికి తగిన గుర్తింపు లభించలేదని జగ్గారెడ్డి వివరించారు. గుర్తింపు కోసమే ఉత్తమ్‌పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన చేసే ఆరోపణలకు సంబంధించి ఆధారాలు ఉంటే మీడియా ముందు పెట్టాలని సవాల్ విసిరారు. లేదంటే సైలెంట్‌గా ఉండాలని కోరారు. ధాన్యం కొనుగోలు విషయంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుందని స్పష్టం చేశారు.

## గౌతమ బుద్ధుడి సందేశం అందరికీ అవసరం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ధ్యానాన్ని ఒక పనిగా చేయడం కాదని.. ప్రతి పనిని ధ్యానంగా చేయడాన్ని పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. బుద్ధ పూర్ణిమ పురస్కరించుకుని ఆయన సికింద్రాబాద్‌లోని మహాబోధి బుద్ధ విహార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "నేను పని చేసేటప్పుడు ధ్యానంగా ఉంటా. సమాజంలో అశాంతి, అసూయలను అధిగమించాల్సిన బాధ్యత అందరిది. మంచి సందేశం, ఆలోచనను పెంపొందించుకోవాలి. సమాజానికి మేలు చేయాలన్న తలంపును ఇతరులకు పంచాలి. గౌతమ బుద్ధుడి సందేశం అందరికీ అవసరం. మహాబోధి బుద్ధ విహార్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది. ధ్యాన మందిరం కోసం నిధులు కేటాయిస్తాం. ప్రతిపాదనలు పంపితే ఎన్నికల కోడ్ ముగిశాక నిధులు మంజూరు చేస్తాం" అని తెలిపారు.




**హైదరాబాద్: మూసాపేటలోని భరత్‌నగర్ వంతెనపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. వంతెనపై మధ్యలో వాటర్‌ట్యాంకర్ టైరు పేలి అక్కడే నిలిచిపోవడంతో వై జంక్షన్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఉదయాన్నే ఉద్యోగాలకు, పనులకు వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ కారణంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వాటర్‌ట్యాంకర్‌ను తొలగించే ప్రయత్నం చేశారు.**

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అన్నీ తుస్సుమన్నాయి: హరీష్ రావు



భూపాలపల్లి జిల్లా: బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గురువారం భూపాలపల్లిలో పర్యటించిన ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి గ్రాడ్యుయేట్ ఎన్నిక జరిగినప్పుడల్లా మనమే గెలిచామని, బిట్స్ పిలానిలో గోల్డ్ మెడలిస్ట్ ఆయన రాకేష్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అన్నీ తుస్సుమన్నాయని, కాంగ్రెస్ ప్రచారంలో 6 గ్యారంటీల్లో ఐదు అమలు చేసినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారని, జాబ్ క్యాలెండర్ పత్తా లేకుండా పోయిందని హరీష్ రావు విమర్శించారు.

ఉపాధ్యాయుల మీద లాఠీ ఛార్జ్ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదని ఆరోపించారు. సన్న బియ్యానికే మద్దతు ధర ఇస్తారట.. మన తెలంగాణాలో దొడ్డు బియ్యం ఎక్కువగా పండిస్తామని... పండించిన రైతుల పరిస్థితి ఎంటని ఆయన ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు పెంచిందని, మహిళా గ్రాడ్యుయేట్‌లు కూడా బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేస్తున్నారన్నారు.

మహిళా పథకం కింద వారికి నెలకు రూ. 2,500 ఇస్తాం అని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. నిన్న వరంగల్ ఎంజీఎంలో కరెంట్ పోయిందన్నారు. విద్యుత్ ఉద్యోగులను కూడా ఈ ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని హరీష్ రావు పేర్కొన్నారు.

## ఫీల్డ్ ఆఫీసర్‌పై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్: గాజులరామారంలో ఫీల్డ్ ఆఫీసర్ కిషన్ లీలలు వెలుగులోకి వచ్చాయి. ఓ మహిళా పారిశుద్ధ్య కార్మికురాలిని లైంగికంగా వేధించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధిత మహిళకు సంబంధించిన వీడియోలు కూడా వెలుగులోకి వచ్చాయి. దీంతో బాధితురాలు మీడియా ముందుకు వచ్చి జరిగిన విషయాన్ని వెల్లడించింది. మహిళను వేధించిన ఫీల్డ్ ఆఫీసర్‌పై గ్రేటర్ అధికారులు చర్యలు తీసుకున్నారు. కిషన్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. గాజులరామారం ఘటనపై మేయర్ గద్వాల విజయలక్ష్మీ స్పందించారు. మహిళ ఉద్యోగిని వేధించడాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఘటనపై పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు ఆదేశాలు జారీచేశారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉండనున్నాయి. ఇప్పటికే కిషన్‌ను విధుల నుంచి తొలగించారు. కుత్బుల్లాపూర్ పరిధిలో గల గాజులరామరం 25 సర్కిల్ పరిధిలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా కిషన్ పనిచేస్తున్నాడు.

అక్కడ పనిచేసే ఓ పారిశుద్ధ్య కార్మికురాలిపై కన్నేశాడు. తాను చెప్పినట్టు వినాలని, లేదంటే వేధింపులు తప్పవని బెదిరించాడు. ఓ గదిలోకి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడేవాడు. ఆ తతంగాన్ని ఫోన్‌లో రికార్డ్ చేసేవాడు. ఆ వీడియోలు బయటకు రావడంతో కిషన్ ఆగడాలు వెలుగులోకి వచ్చాయి. ఆ వీడియోలు చూసి ఇతర కార్మికులు ప్రశ్నించారు. ఎవరికి చెప్పొద్దని డబ్బు ఆశ చూపాడు. 14 మందికి తలా రూ.10 వేల చొప్పున ముట్ట జెప్పాడు. అయినప్పటికీ ఆ వీడియోలు వైరల్ అయ్యాయి. అతనిపై చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఇప్పటికే విధుల నుంచి తప్పించారు. పూర్తి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660